● బద్దూరి నరసింహం

# మంటలు



అనుమానంలేదు. ఆమె సుశీలే. మరోసారి కళ్ళు చిట్లించి చూసి మరీ నిర్ధారణగావించాడు రఘుమూర్తి.

సుల్తాన్‌బజార్‌లో రద్దీ తక్కువగా నున్న దినమేదీ కనిపించలేదు రఘుమూర్తికి. ఎప్పుడూ ఏదో జాతర జరుగుతున్నట్లు జనం. ఎంత కసురుకుంటున్నా లెక్కచేయక తోసుకుంటూ సాగిపోతుంటారు మంది. చీపురుకట్టనుంచి సీమసరుకువరకు అడిగినది లేదన

కుండా అన్నీ దొరుకుతాయక్కడ. మరి అంతజనం తిరగడం ఆశ్చర్యమేమీ కాదనుకున్నాడు.

కాని

అంతమందిలోనూ ఒకే ఒక వ్యక్తిపై అతనిచూపులు నిర్నిమేషంగా నిలిచి పోవడం ఆశ్చర్యమే మరి.

ఎదురుగా బట్టలకొట్లోకెళ్ళిన ఆమె వేపే చూస్తూ వెళ్ళి పలకరిద్దామా?వద్దా? అన్న సందిగ్ధంలో పడిపోయాడు.

చేతికి ప్రేలాడే ంచే తనొచ్చినపనిని గురుచేసేసరికి ఆదరాబాదరా కొన్ని కూరగాయలు కొని ఆమెరాకకై నిరీక్షి స్తూ ఓమూలగా ఒదిగి నిల్చున్నాడు సిగరెట్ వెలిగించి

ఆ నిరీక్షణలో అతని ఆలోచన్లు నాలుగేళ్ళ వెనక్కి వెళ్ళాయి.

రఘుమూర్తి పనిచేసే ఆఫీసులో ఆ రోజు 'టైపిస్టు' పోస్టులోకి ఓకొత్తమ్మా యొచ్చింది. అంతకుముందు కళాశాల జీవితంలో ఎందరో అందమైన అమ్మా యిల్ని చూశాడుకాని ఇంత సహజమైన అందం ఎప్పుడూ చూడలేదను కున్నాడు.

అతనలా అనుకోడంలో అతిశయోక్తి కూడా ఏమీలేదు.

అప్పట్లో అతను బ్రహ్మచారి. తలి దండ్రులు పెళ్ళి ప్రయత్నాలు చేస్తు న్నారు. కాని ఇంకా ఏదీ కుదర్లేదు. కొన్ని వాళ్ళకు నచ్చలేదు. కొన్ని సం బంధాలు తనకు నచ్చలేదు. ఏది ఏమైనా జీవితాంతం ఉండే బంధం గనక ఆలస్యం జరిగినా అనుకూలమైన భార్య కోసం నిరీక్షిస్తున్నాడు.

జీవితంలో కొన్ని నిర్ణయాలు చేసు కోవాల్సిన అవసరాలు ప్రతి ఒక్కరికీ ఎప్పుడో ఒకప్పుడు తారసిల్లుతాయి. ఆ నిర్ణయాలకు పట్టేకాలం కొందర్కి నెలలుకావచ్చు, కొందర్కి ఏళ్ళు కావచ్చు. కొందర్కి కాలమే సరిపోక వచ్చు.

తనపెళ్ళి విషయంలో రఘుమూర్తి నాలుగేళ్ళగా ఏ నిర్ణయమూ చేసుకోలేక పోయాడు. కాని ఆమెను చూసిన ఆ క్షణం..........అబ్బ! ఎదురు చూసిన నాలుగేళ్ళకన్నా ఆక్షణం ఎంత గొప్పది: చూసిన మరుక్షణమే 'ఈమెను పెళ్ళా డితే ఎంత బాగుండును' అనుకున్నాడు.

ఏదో ఒకరోజు సహవ్రతులైన ముగ్గురు మిత్రులతో కలసి హోటల్లో టిఫిన్ చేస్తుండగా ఖాళీగాఉన్న ప్రక్క టేబుల్ పైకి కొత్తగా పెళ్ళైన జంట కాబోలు వచ్చి కూర్చున్నారు. తినడం మర్చి ఒళ్ళూ, కళ్ళూ అప్పగించి అటే చూస్తున్న ముగ్గుర్ని నెమ్మదిగానే ఐనా కాస్త కటువుగానే మందలించాడు తను.

"మహ చెప్పొచ్చావ్లే. నాకు పేరు తెలీదుకాని వెనకటికెవడో గొప్ప కవి అన్నట్లు గురు "అందమైనదాన్ని చూచి ఆనందించడంలో తప్పులేదట" అన్నాడు గోపి.

"ఏతంఁడంగా ఆలోచిస్తే ప్రతిసూక్తికీ విపరీతార్థాలు చెప్పొచ్చు. ఒరేయ్ : పరాయిస్త్రీని కంటితోనేగాదు మనసా, వాచా మరోవిధంగా చూస్తే తప్పే" సమర్థించుకున్నాడు తను.

రవికి ఆమాటలు నచ్చినట్లు లేవు. అందుకే –

"రఘూ! నీ వాదన సరైందికాదు. ఆడది తన అందాన్ని పరాయికంట పడకుండా గుట్టుగా ఉంచుకుంటే మంచిదేకాని 'నన్ను చూడు నా అందం చూడన్నట్లు సీతాకోక చిలుకలా సింగారించుకుని పదుగుర్నీ ఆకర్షించాలన్న ఆకాంక్షే లేకుంటే ఎందుకు వారికంత అలంకరణ" అన్నాడు ఘనవిషయం చెప్పినట్లు

"ఇంకా నయం రోజూ తల దువ్వి బొట్టుపెట్టుకోడంకూడా అనవసరమన్లేదు" ఉద్రేకంతో అన్నాడు తను.

"శాంతి.... శాంతి." వాసు అందుకున్నాడు "ఒరేయ్ రఘూ! పోనీ అలంకరించుకున్నారే అనుకుందాం. ఇలా నలుగురు మగాళ్ళుండే చోట విచ్చలవిడిగా తిరిగితే ఎంతటి అపరఆంజనేయులైనా కళ్ళు తాటించడం తప్పదుమరి. ఏం జేస్తాం!" అన్నాడు తప్పంతా స్త్రీల మీదకే త్రోసి.

'అనువుకాని చోట అధికులమనరా' దనుకుని ఏకమైన ముగ్గురి అభిప్రాయాలతో మనసు ఏకీభవించక పోయినా వాదన అంతటితో ఆపుజేశాడు తనానాడు.

అలాంటి రఘు ఇప్పుడదేపనిగా లేడీ టైపిస్టుకేసి చూస్తుంటే గోపీ, వాసూలు కాసేపుచూసి ముసిముసిగా నవ్వుకున్నారు.

టైప్‌చేసిన కొన్నికాగితాలు పట్టుకుని ఆవిడ ఆఫీసర్ రూంలో కెళ్ళగాని గోపీ, వాసూలు దూరంగా వున్న రవిని కూడా పిల్చి రఘుమూర్తి బల్లముందు తిష్టవేసారు.

"ఏం భాయ్! ఆనాడు మాకు నీతులు జెప్పి ఇప్పుడు నువ్వు చేస్తుందేమిటి?" అన్నాడు గోపి

"ఒరేయ్! ఈయన చూసిన చూపులో మాలిన్యం లేదురా. అది పవిత్రమైన చూపు." తాళం వేశాడు వాసు.

"వీడు ప్రేమలో పడ్డాడ్రా." మూడు ముక్కల్లో నిజంగా నిజం చెప్పేశాడు రవి.

మళ్ళీ గోపీ అందుకున్నాడు "అది కాదురా రఘూ! మా ముగ్గురికీ పెళ్లి పెటాకులయ్యాయి. కాపురాలూ వెలగబెడుతున్నాం. నీవుమాత్రం ఎన్నాళ్లిలా...... నీకు తెలుసుగా బెండకాయ ముదిరినా బ్రహ్మచారి ముదిరినా........." అతడి వాక్యం పూర్తి కాకమునుపే మిగతా ఇద్దరూ ఘొల్లున నవ్వారు,

రఘు ముగ్గురివేపూ కాస్త సీరియస్‌గా చూశాడు. "ఇది పరిహాసమేంకాదు. ఆవిడ ఒప్పుకుంటే నిజంగానే పెళ్ళాడతాను" అన్నాడు బల్లగుద్ది. అక్కడ కుండలేదు. కాబట్టి బ్రద్దలవకుండా బ్రతికింది.

ఇంతలో ఆఫీసర్ రూంలోంచి మరో లెటర్స్‌ఫైల్ పట్టుకుని ఆవిడ బయట కొచ్చింది. చల్లగా ఎవరిచోట్లోకి వారు జారుకున్నారు.

ఆ సమిష్టి సమావేశంలో తన గురించే చర్చ జరిగిందని గ్రహించ

దానికామె కెక్కువసేపు పట్టలేదు. ఎవర్ని చూసినా తనవేపే చూస్తూ తను చూడగానే కళ్లు వాల్చుకుంటున్నారు. ఆవిడ అసహ్యించుకొని తనపనిలో తాను నిమగ్నమైపోయింది.

ఆవిడ అలంకరణా, ప్రవర్తనా చూస్తుంటే ఏదో పేదింటి పిల్లలానే వుంది. రఘు మనసు పనిమీద నిలవడంలేదు. ఎలాగైనా ఆమె తలిదండ్రులెవరో వాకబుచేసి మిత్రబృందం సాయంతో అట్నించి నరుక్కువద్దామనే ఆలోచనలతో ఐదుగంటలకల్లా ఆరోజుకు ఆఫీసుపని అయిందనిపించాడు.

ఏకాగ్రతతో టైప్‌చేస్తున్న ఆవిడ వేపు ఆఖరుసారిగా చూసి ఇంటికెళ్లిపోయాడు. ఆచూపు నిజంగా ఆఖరు చూపే అయింది. ఎంతో ట్రిమ్‌గా తయారై మర్నాడు అరగంట ముందే ఆఫీసుకెళితే ప్యూను వెంకన్న మెల్లగా చెప్పాడు "అయ్యగారు రాగానే ఇమ్మని నిన్నొచ్చిన సుశీలమ్మగారు ఈకవరిచ్చి వెళ్లారు బాబూ" అని

రఘు అయోమయం చెంది వెంకన్నను మెల్లగా హోటల్‌కేసి నడిపించాడు. రెండు కాఫీలకార్డరిచ్చి "ఆఁ ఏముంటుంది. సెలవుచీటీ అయ్యుంటుం"దని మెల్లగా కవరుతీసి లెటర్ చదివాడు 'రాజీనామాపత్రం?' అతని ఆశ్చర్యానికంతులేదు. నేటిదాకా అందుక్కారణం నిజంగానే అంతుపట్టలేదు.


మహిళల సౌభాగ్య శోభలకు

"చార్మ్"

కంపెనీవారి సౌందర్య సాధనములనే వాడండి!

ప్రతిస్త్రీకి నుదుట 'చార్మ్' తిలకము అందము (8రంగులలో)

ప్రతిస్త్రీకి "చార్మ్" కాటుక అందము (కంటికి చల్లదనము)

ప్రతిస్త్రీకి నుదుట 'చార్మ్' బొట్టు అందము (7 రంగులతో)

ప్రతిస్త్రీకి నుదుట 'చార్మ్' కుంకుమపేట్టు అందము

అన్ని షాపులలో దొరుకును (నుదుట మచ్చపడదు)

: డిస్ట్రిబ్యూటర్స్ :

చార్మ్ కాస్మెటిక్ కంపెనీ
మద్రాసు

శ్రీ రాజరాజేశ్వరీ & కో
కె. వి. ఆర్. స్వామి రోడ్డు
రాజమండ్రి

ఏవో చీరలు కొన్న ప్యాకెట్‌తో ఆవిడ షాపు బయటకొచ్చింది. తననామె చూడలేదు. తనే మాట్లాడదామనుకొన్నా ధైర్యం చాలడంలేదు. ఇంతకూ ఆవిడ నివాసమెక్కడోనని ఇరవైగజాల దూరంలో వెంబడించసాగాడు.

కోటీలో రిక్షా ఎక్కి ఇస్లామియా బజార్లో దిగింది. తనూ రిక్షాలో వెంబడించి కాస్త దూరంలో దిగాడు. ఆమె ఓ తలుపుతాళం తీసి లోనికెళ్ళింది. ఆ తలుపు గుర్తుంచుకొని ఆరోజు ఇంటికెళ్ళిపోయాడు.

మర్నాటి సాయంత్రం ఆసందు చివరన ఇంటికి కాస్త దూరంలో "వెళదామా? వద్దా?" అనుకుంటూ పచార్లు చేయసాగాడు. ఐదు నిమిషాలు ఇతని వాలకాన్ని గమనించిన ఒక లుంగీ వాలా "ఏంసాబ్ వచ్చేమన్నా కావాలా?" అన్నాడు దగ్గరకొచ్చి

అతనన్న మాటలకర్థం తెలీక తికమకపడ్డాడు రఘు.

"ఈమధ్యనే వచ్చింది సాబ్. కొత్త పిట్ట. వచ్చితేనే బేరం కుదుర్చుకొండి".

మొదటి ప్రశ్నలోని అర్థం అప్పుడుగాని తెలిసిరాలేదు. రఘుకు అలాటి అలవాట్లేం లేవుగాని అనుకోకుండానే అడిగేశాడు "ఎక్కడ వుంది?"

బ్రోకర్‌లా ఉన్న మనిషి ఆ ఇంటికేసి చూపించాడు. సంభ్రమించి పోయాడు రఘు. ఆవిడ చేస్తున్నవృత్తి యిదా? నమ్మకం కలగలేదతనికి. "ఎవరా పిల్ల? ఏడూరిది?" అడగకుండా వుండలేకపోయాడు.

"ఎవరో సాబ్! మొన్ననే వొచ్చింది. తెలుగు పిల్లే. మీరు చూస్తే యిడిసిపెట్టరు."

యిలాటి అనుభవమెప్పుడూ అతనికి లేదు. బేరమెలా ఆడాలో, బ్రోకర్‌తో ఎలా మసలుకోవాలో తెలీదుగాని తను చదివిన చాలా కథల్లో యిలాటి సంఘటనలొచ్చాయి. ఆధైర్యంతో "ఐతేపద" అని బక్షీష్‌గా రెండురూపాయలందించి అనుసరించాడు.

వాడు తలుపుతట్టి "గిరాకి తెచ్చిన మాట్లాడుకోండి" అని కేకేసి లోనికి పొమ్మని సైగచేసాడతనికి. రఘులోని కడుగిడగానే ఆమె ఓ నిమిషం పరికించి చూసి "మీరా!" అంది ఆశ్చర్యంగా.

"ఔను" ముక్తసరిగా జవాబిచ్చాడు.

"నేనిక్కడున్నానని తెలుసామీకు?"

"ఇక్కడ ఉన్నట్లు నిన్న తెలిసింది. ఈ వృత్తిలోఉన్నట్లు ఇప్పుడేతెలిసింది" అతని స్వరంలో అసహ్యం తొంగి చూసింది.

ఆమె లెక్కచేయలేదు.

"మీకు పెళ్ళయిందనుకుంటా" నవ్వుతూ అడిగింది.

అయిందన్నట్లు తలూపాడు.

"మరివేం పాడు బుద్ధులు? ఇలా వచ్చారు."

"నాకిలాటి పాడుఅలవాట్లేం లేవు. నిన్న ఈ ఇంట్లోకి నువ్వెళ్ళడం చూశాను. నాకు తొందర పనివుంది అప్పట్లో పలకరించక రేపు తీరిగ్గా మాట్లాడదామనుకున్నాను.

"ఎందుకూ ?"

'ఏదో నాలుగేళ్ళ గతంగుర్తుకొచ్చి'

"నీతో మాట్లాడాల్సినంత అవసరం మీకేముందో బోధపడ్డంలేదు."

"తపస్సు తలక్రిందులుగా చేసినా ఉద్యోగం దొరకని రోజుల్లో జాబ్‌లో చేరిన విన్ను చూసిన మొదటిరోజు .... అదే.... ఆ.... ఒకేరోజుతో ఊరే విడిచి వచ్చేశావ్ అలా ఎందుకు జరిగిందో. రిజైన్ ఇవ్వాల్సినంత అవసరమేమిటో నాకింతవరకూ అంతుపట్టలేదు. అది తెలు...."అతడి వాక్యమింకా పూర్తి కాలేదు.

"అది మీరడుగకూడదు. నేను చెప్ప కూడదు" అంది మధ్యలో కలుగజేసు కుని.

అతనిలో ఆసక్తి మరింతపెరిగింది.

"అబ్బో అంతరహస్యమా?ఇలాంటి వారి జీవితాలు ఊరంతా తెలుసు" ఆమెని ఉడికించాలనామాటన్నాడు.

"అంతసహ్యంగా మాట్లాడకండి. మీలాటి పాడుమనుషులుండబట్టే నాలాటి వారు తయారౌతున్నారు."

"పోనీ నాది పాడుబుద్ధులే అనుకో. మరి ఏదో?"

"అదేకదా వచ్చినచిక్కు. పైమెరుగులు చూసే లోకం మనిషికి విలువ కడుతుంది. నిజానిజాలు తెలుసుకోవాలన్న ఓపికా, జ్ఞానమూ ఎవరికీ ఉండదు

"పోనీండి. అందుకేగా ఇందాకా వచ్చింది:"

"నిజంగా ?"

"నిజం. ఏ దురుద్దేశంతోనూ నేను రాలేదు. నీవు కనిపించావు. గతంలోని ఒక ప్రశ్నార్థకం కనిపించింది. ఆ అనుమానం తీర్చుకోవాలని అంతే" అన్నాడు రఘుమూర్తి నమ్మమన్నట్లు.

"ఐతే వినండి" ఒక దీర్ఘనిశ్వాసం విడిచి ఆమె చెప్పసాగింది. "పెళ్ళీడు వచ్చినా, అడిగినదాంట్లోసగమైనాకట్నం ఇవ్వలేని స్థితిలో పెళ్ళిపెటాకులు కాక, అష్టకష్టాలూ పడి స్కూల్ ఫైనల్‌పాసై వెనువెంటనే టైపు నేర్చుకుని హయ్యర్ గ్రేడ్ తీశాను. కష్టపడి కనిపెంచిన తల్లిదండ్రులను అవసానదశలో ఆదుకొనుట నా కర్తవ్యంగా భావించాను. ఉద్యోగం కుదిరాక పెళ్ళి చేసుకోవచ్చునుకుని అందుకై ప్రయత్నించాను. ఏడాదిపాటు తిరగ్గా, తిరగ్గా మీరుపనిచేసే ఆఫీసులో పనిదొరికింది. నేనుచేరిన మొదటిరోజు ఆఫీస్‌టైం అనగానే మీరంతా వెళ్ళిపోయారు. 'ప్రొద్దున్నే పోస్టు చేయాల్సిన అర్జంటు లెటర్సంటూ ఒక ఫైలిచ్చి, "పనైపోగానే ఇంటికి తెచ్చివ్వు ఇల్లు ప్ల్యాన్ చూపిస్తా"నని చెప్పి వెళ్లాడాఫీసర్.

ఉద్యోగంలో చేరిన మొదటిరోజు, ఏదికాదంటే ఏమౌతుందోనని చెప్పిందానికల్లా తలూపి రెండుగంటల్లో పని పూర్తిచేసి వెంకన్నతో ఆఫీసరింటికెళ్ళాను. వెంకన్న చెప్పాడు, ఆయనగారి భార్య ప్రసవానికి పుట్టింటి కెళ్ళిందట. పరవాలేదు. పైకెళ్లమని వెంకన్న సైగ చేశాడు.

ధైర్యంచేసి మేడమెట్లెక్కి పిలి

చాను. ఆఫీసరుతో బాటు ఆ గదిలో మరొకతనున్నాడు. ఇద్దరూ త్రాగిన మైకంలోనున్నారు. బల్లపై గ్లాసులూ, సీసాలూ చూసి నాకు భయమేసింది.

"ఫరవాలేదు రా సుశీలా! ఏదీ ఫైలు. ఇలా తే". అన్నాడాఫీసరెంతో మృదువుగా. మెల్లగా లోనికెళ్ళి ఫైలు టేబిల్ పై పెట్టాను. అంతే-ఆ మరొకతను వెంటనేవెళ్ళి తలుపులు మూసేశాడు.

ఆవిడ కళ్ళలో ఎర్రజీరలగుపించాయి రఘుమూర్తికి.

"ఆ తర్వాత జరిగిన సంగతి చెప్పలేను. ఏ ఆడదీ ఆ రాక్షస కృత్యాలను చెప్పలేదు. ఆమె కంఠం గద్గదమైంది.

రఘుమూర్తి మిగిలిందల్లా ఊహించుకున్నాడు.

"మనుషుల్లో ఇంత కిరాతకులుంటారని కథల్లోనే గాని నిజంగా జరగడం వినలేదు. మనసులో ఇంత హాలాహలం నింపుకుని మరి ఇలా బ్రతకటానికి కారణమేమిటి ?"

బ్రతుకుమీద రోతపుట్టి చచ్చిపోదామనే అనుకున్నానా రాత్రి. అన్యాయంగా నన్ను నేనే చంపుకుంటే ఆఫీసర్లాటి వాళ్ళకి న్యాయమెవరు చేస్తారని అంతరాత్మ ఘోషించింది. నాలాటివారు గమ్మున పడిఉండబట్టే అలాటివారి ఆటలు కొనసాగుతున్నయ్. నాలో ఆ క్షణం మగజాతిమీద కక్ష సుళ్ళు తిరిగింది—ఇంకాస్త వివేకంగా ఆలోచించాను. నేను ఎలాగూ చెడిపోయాను. అదేరీతిగా పనిగట్టుకుని ఆర్నెల్లపాటు తిరగాల్సిన చోటల్లా తిరిగి, చేయాల్సిన పనులన్నీ చేసి ఒక ప్రత్యేక వర్గంపైన నాకసి తీర్చుకోవాలనుకున్నాను. న్యాయశాస్త్రంకూడా నన్ను నేరస్తురాలిగా నిరూపించలేని పథకం వేసుకున్నాను. నేనిపుడు అందమైన నగిషీ బొమ్మను. కాని ఆ బొమ్మకు చెదలు పట్టింది. ఎవరికీ అగుపించదది. అలా ఏ వైద్యానికీ నయంకాని వ్యాధుల నంటించుకున్నాను. నా ఈ స్థితికి కారకులైన ఆ ఇద్దరాఫీసర్లనూ వారికి బ్రోకరులా పనిచేసే ఆ వెంకన్ననూ నాగాలాని కెరజేశాను. యిప్పుడు వారు చచ్చేదాకా మంచం వదల్లేరు." ఆమె హృదయంలో ఎంతటి బడబానలం రగులుతుందో స్పష్టంగా తెలిసొచ్చింది రఘుమూర్తికి.


Grams : 'JAI KISAN'

Phone : 1671

**JAI KISAN**

FERTILIZERS CORPORATION

Dealers In Fertilizers. Insecticides and other Agricultunel Commodities, Implements Etc.,

*PatnamBazar : GUNTUR*

కాని ఆ కక్షకి అమాయకులెందరు బలైనారోనన్న అనుమానం పీడించ సాగింది.

"సుశీలా అన్యాయం చేసినవార్ని తప్పకుండా శిక్షించాలి. అంతవరకూ ఒప్పుకుంటాను. కాని నీ ఈ ప్రతీకారంలో అన్నెంపున్నెం ఎరుగనట్టి అమాయకులెంద రాహుతౌతున్నారో గదా!"

"అదేంలేదు. నేను ముందే చెప్పాను. మగజాతిలో ఒక ప్రత్యేకవర్గంపైనే నా కక్ష."

"అంటే?" అర్థంకాక అడిగాడు రఘుమూర్తి.

"ఎందరో పేదల కడుపుకొట్టి, ఎన్నో అక్రమాలుజేసి రెండు చేతులా సంపాదించిన డబ్బు నెలా ఖర్చు పెట్టాలో తెలియక తికమకపడే ధనిక వర్గంపైనా, హాయిగా పెళ్లాంపిల్లలో కాపురం వెలగబెట్టక అధికార మదంతో అందంగా కనిపించే ప్రతిఆడదాన్నీ అనుభవించాలనుకునే కాముక వర్గం పైనా కక్షలోవత్తులు పెట్టుకు వెతికి వెతికి మరీ నా గుండెమంటను చల్లార్చు కుంటున్నాను. అలా నాతో ఒక్కరాత్రి సుఖంగా గడిపినవాడు జీవితాంతం ఏ రాత్రి సుఖంగా నిద్రపోలేడు. నా గుండెల్లో రగిలే "మంటలు" చల్లార డానికి ఈ శిక్ష వారికి చాలు. ఆ తృప్తి చాలునాకు. ఉద్రేకం ఉపశమించుకో డానికొచ్చే ఏవిలాస పురుషులనూ నే నింతవరకూ మోసగించలేదు. ఏదో వంకతో వారిని త్రిప్పి పంపుతానేగాని వారి జీవితంతో ఆటలాడను."అందామె.

ఆమె చేస్తున్నది తప్పనడానికి రఘు మూర్తికి నోరు రావడంలేదు. చేసేదిలేక సెలవుదీసుకుని బరువుగా కదిలాడు.

త్రోవ పొడుగునా అతని బుర్రలో ఒకే వాక్యం మెదులుతోంది, "ఒక్క రాత్రి విలాసంగా గడిపినవాడు జీవితాంతం సుఖంగా నిద్రపోలేడు""

"అబ్బ! ఎంత పెద్ద శిక్ష?"

మనసులోనే అనుకున్నాడు.

---

● ప్రజలకు మీరంటే యింత అభిమానం దేనికండీ? అన్ని విందులకు, సమావేశాలకు మిమ్మల్ని ప్రత్యేకంగా ఆహ్వానిస్తున్నారు....ఏమిటి రహస్యం? అన్నాడు మాధవరావు.

ఇదివరకు ఎవరైనా నాకు నచ్చని మాటలు చెపితే "ఛీ! ఛీ!" అనేవాణ్ణి. ఇప్పుడు "బాగుబాగు" అంటున్నాను. ఇలా అనడంతో వాళ్ళ మాటల్ని హర్షిస్తున్నానని అనుకుంటున్నారేమో పాపం! అది నా ఊతపదం అని వారికి తెలీక విందులకి, సభలకు పిలుస్తున్నారు" అన్నాడు కుటుంబరావు నవ్వుతూ.

—"చిట్టి"

---